క్లుప్తంగా

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి



కృష్ణారాయుడుపేటలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కుమ్మపల్లి, కృష్ణారాయుడుపేట పంచాయతీల్లో బుధవారం ఆయన పర్యటించి వాటర్ ట్యాంక్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, బోరు బావులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు నౌడు అరుణ, బాలబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌తో రక్షణ



మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ అనిత

గంట్యాడ: ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించి రక్షణ పొందవచ్చని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ టి.అనిత అన్నారు. మండలంలోని కొఠారుబిల్లిలో కూడలిలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో వన్‌స్టాప్ సెంటర్ సేవలపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించిన వారికి రక్షణ, సంరక్షణ, వైద్య, న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు ట్రోల్ ఫ్రీ నంబర్ 181కు, 18 ఏళ్ల లోపు పిల్లలు చైల్డ్‌లైన్ ట్రోల్ ఫ్రీ నంబర్ 1098ను సంప్రదించాలని కోరారు.

సలహాలు పాటించాల్సిందే..



ఎస్ బూర్జవలసలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ అనురాధ

దత్తిరాజేరు: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఏఓ అనురాధ అన్నారు. మండలంలోని ఎస్. బూర్జవలస, కె. కృష్ణాపురం గ్రామాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామాలలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని రైతులు ఈ నెల 13లోగా వీఏఏ లాగిన్ నుంచి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే వరిలో కలుపుతీయు విధానం, ఎరువులపై అవగాహన కల్పించారు.

కనీస వేతనం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డి.అప్పలరాజు, తదితరులు

జామి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కనీస వేతనంగా రూ. పది వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణంరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. వేతనం పెంచడంతో పాటు మెనూ రేట్లు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో రమణమ్మ, దేముడమ్మ, అచ్చియ్యమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడ్ని సత్కరిస్తున్న ఇప్పిలి అనంతం, తదితరులు

చీపురుపల్లి: మండలంలోని పుర్రేయవలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి మెట్టపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్‌కు బదిలీపై వెళ్లిన కర్రోతు విశ్వేశ్వరరావును ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, సర్పంచ్ సారిక మోహనరావు, తదితరులు ఉపాధ్యాయుడ్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, పాఠశాల హెచ్ఎం ఎంవీ భారతి, ఉపాధ్యాయుడు ఎస్‌వీ అప్పలనాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంది నాగచంద్రరావు, గ్రామ పెద్దలు జమ్ము అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు వదిలేదెప్పుడు..?



ఎస్.కోట ప్రధాన రహదారిలో ఆక్రమిత దుకాణాల ముందు నిలిచిన మురుగు

- పేరుకు మాత్రం హైవే...
- జనాలకు మాత్రం నో వే...
- దుర్వాసనతో అవస్థలు పడుతున్న ప్రజలు

శృంగవరపుకోట: 'అరుకును ఆంధ్రా ఊటీ చేస్తా.. పుణ్యగిరిని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం..' అంటూ ఎన్నికల వేళ గొప్పలు చెప్పిన చంద్రబాబు, కూటమి పెద్దలకు ఎస్.కోట హైవేలో పేరుకున్న మురుగు కనబడడం లేదు.. కంపు గుర్తుకు రావడం లేదు.. ఎస్.కోట ప్రధాన రహదారిలో పేరుకున్న మురుగు కూటమి నేతల కంపు రాజకీయాలకు సాక్ష్యంగా నిలుస్తోంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వెంబడి ప్రధాన రహదారిలో మురుగు పేరుకుపోయి వాహనాల రాకపోకలకు, పాదచారులకు నరకప్రాయంగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారీ పూడుకుపోయిన కాలువల గుండా నీరు ప్రవహించక రోడ్డుపైకి చేరుతోంది. ఇటీవల మురుగునీటి తరలింపునకు రెండు దఫాలు పంచాయతీ ఈఓ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

స్టేట్ హైవే నుంచి నేషనల్ హైవేగా మార్పు..

పెందుర్తి నుంచి బొడ్డవర వరకు ఉన్న ఎస్.కోట రోడ్డు గతంలో స్టేట్ హైవేగా ఉండేది. 2021లో ఈ రోడ్డును నేషనల్ హైవేగా మార్చారు. 'పేరుకు పెళ్లాడటమే కాని కూడు పెట్టటం మా కులాచారం కాదు' అన్న సామెత తీరుగా ఉంది కూటమి పెద్దల తీరు. ఎస్.కోట రోడ్డు బాగుకోసం కూటమి పెద్దలు చేసింది శూన్యం. కొంతమంది పెద్దలు రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడం.. కల్వర్టులు, కాలువలు కప్పేయడంతో సుమారు 50 వేల జనాభా ఉన్న కోట కునారిల్లుతోంది.

ఆక్రమణలు..

కళాశాల మైదానం ప్రహరీ వెంబడి ఉన్న ప్రధాన రహదారిని కొంతమంది ఆక్రమణదారులు స్థానిక పెద్దల అండదండలతో ఆక్రమించి శాశ్వత షెడ్‌లు నిర్మించారు. రోడ్డులో సగం వరకూ వచ్చేసి వ్యాపారాలు చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ. 3 వేల నుంచి పది వేల రూపాయల వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. కొంతమంది ఈ స్థలాలను రూ. 2 నుంచి మూడు లక్షల రూపాయలకు లీజుకు ఇచ్చారు. ఈ ఆక్రమణల వల్ల కాలువల నుంచి మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది.

నిజం వినకు..కనకు..మాట్లాడకు..

స్థానిక అధికారులు 'నిజం కనకు.. నిజం వినకు.. నిజం మాట్లాడకు.' అన్న రీతిలో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలపై నిర్ణయాధికారం ఉన్న తహసీల్దార్.. ప్రజారోగ్యానికి బాధ్యత వహించాల్సిన పంచాయతీ అధికారులు.. ప్రజారక్షణ చేపట్టాల్సిన పోలీస్ అధికారులు ఆక్రమణల ఊసెత్తడం లేదు. ప్రజలు ఇబ్బంది పడినా, రోగాలు విజృంభించినా, ప్రమాదాలు జరుగుతున్నా వీళ్లంతా చెప్పే సమాధానం 'రోడ్డు ఆర్అండ్‌బీ వాళ్ల స్థలం. వాళ్లే చూడాలి' అంటారు. ఇదే విషయమై ఎన్‌హెచ్ఏఐ జేఈ సురేష్ వద్ద ప్రస్తావించగా.. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు సహకరిస్తే ఆక్రమణల తొలగింపునకు మిషనరీ ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు



గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి బొత్స జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న మండల నాయకులు

- గరివిడి క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బొత్స హయాంలో చీపురుపల్లి నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. చీపురుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రంలో గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. బొత్స సత్యనారాయణకు భగవంతుడు మంచి ఆరోగ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ఎలకల అప్పలనాయుడు, ఎడ్ల అప్పారావు, సర్పంచ్‌లు పొన్నాడ కుమార్, బూడి శ్రీరాములనాయుడు, గుడివాడ తమ్మినాయుడు, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, ఎంపీటీసీ సభ్యులు కడుమల రాంబాబు, యల్లంటి పోలీసునాయుడు, యడ్ల సూర్యారావు, నాయకులు గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, పాసి రాము, చంద్రకుమార్, తోట రవి, కరణం అప్పలనాయుడు, ముద్దాడ రమణ, రేగిడి లక్ష్మణ, జగదీష్, కాంతారావు, వేణుగోపాల్, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా..

గుర్ల: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శాసనమండలి విపక్షనేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, వరదా ఈశ్వరరావు, కెంగువ మధుసూధనరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, జమ్ము స్వామినాయుడు, తోట తిరుపతిరావు, అట్టాడ రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'తల్లికి చెట్టు'ను విజయవంతం చేయండి



సోంపురం పాఠశాలలో మొక్కలు అందజేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు, తదితరులు

- ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం రూరల్: మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం నిర్వహించనున్న తల్లికి చెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సిబ్బందిపై ఉందని మండల విద్యాశాఖాధికారి విమలమ్మ తెలిపారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో సీఆర్‌పీలు, ఎంఈఓ కార్యాలయం సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మెగా పేరెంట్స్ డే సమావేశాన్ని కూడా విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 చక్రధరరావు, సీఆర్‌పీలు రెడ్డి, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి..

వేపాడ: మెగా పేరెంట్స్ డే సందర్భంగా తల్లిదండ్రులకు అందించే ప్రతి మొక్కనూ నాటి సంరక్షించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. గురువారం జరగనున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో పంపిణీ చేసేందుకు 2700 మొక్కలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు ప్రతి పాఠశాలకూ మొక్కలు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సోంపురం హెచ్ఎమ్ బీపీఏ రాజు, సీఆర్‌పీ, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



దెందేరు రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ భానులత

కొత్తవలస: మండలంలోని దెందేరు, గనిశెట్టిపాలెం గ్రామాల్లో గల రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ వరి నారుమడుల యాజమాన్యం పద్ధతులపై వ్యవసాయశాఖ కొత్తవలస సబ్ డివిజన్ అధికారి బి. భానులత బుధవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేపట్టాలన్నారు. వరి సాగు చేసే రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశం ఆగస్టు 15 వరకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కేవీ రామ్‌ప్రసాద్, దెందేరు పశువైద్యాధికారి అరుణకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



వైద్యశిబిరంలో పాల్గొన్న సిబ్బంది

జామి: మండలంలోని జాగరం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఎస్.కోట కోలపర్తి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సర్పంచ్ వసి పార్వతి ప్రారంభించారు. డాక్టర్ నీరజకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సుమారు వంద మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

• నేడు గురుపౌర్ణమి



మెరకముడిదాం: సోమలింగాపురంలో వెలిసిన శేష సాయిబాబా

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో గల దత్తసాయి మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు గురువారం నిర్వహించనున్నట్లు మందిర కార్యనిర్వాహకుడు తంగుడు రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుఝాము 5 గంటలు నుంచి ప్రత్యేక పూజలు చేపడతామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సోమలింగాపురంలో..

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం శేషసాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ ధర్మకర్త ఎస్‌వీ రమణరాజు ఆధ్వర్యంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



ఎస్.కోట: విద్యుద్దీప కాంతులతో మెరుస్తున్న ఎస్.కోట పట్టణంలో షిర్డీసాయినాథుని ఆలయం

ఆలాయలు సిద్ధం..

శృంగవరపుకోట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని షిర్డీసాయి ఆలయాలు గురుపౌర్ణమి వేడకలకు సిద్ధమయ్యాయి. ఆలయాలను విద్యుత్ అలంకరణలో ముస్తాబు చేశారు. తెల్లవారుజాము నుంచి క్షీరాభిషేకాలు, భస్మాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు, సహస్రనామ పూజలు, హారతులు, నారాయణసేవ కార్యక్రమాలు చేసేందుకు దేవాలయాల నిర్వాహకులు రంగం సిద్ధం చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి..

- ఏఓ స్వాతి

వేపాడ: ఖరీఫ్ సీజన్‌లో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.స్వాతి సూచించారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో బుధవారం 'పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. వరి పంటకు సంబంధించి ఎకరాకి రూ. 200 ఇన్సూరెన్స్ కట్టాలని సూచించారు. పంటకు బీమా చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగితే ఎకరాకు రూ. 40 వేల పరిహారం అందుతుందని చెప్పారు. రైతుసేవా కేంద్రాల్లో ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకోవచ్చునని తెలిపారు. అన్నదాత సుఖీభవ తుది జాబితా సీఎస్‌సీ కేంద్రాల్లో ఉందుబాటులో ఉందని, రైతులు చెక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న ఏఓ స్వాతి

అన్ని పాఠశాలల్లో ఎంపీటీ మీటింగ్..

- మండల ప్రత్యేకాధికారి దినకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి దినకర్

గంట్యాడ: మండలంలోని అన్ని పాఠశాల్లో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ గురువారం నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి దినకర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల చదువుతో పాటు ఆరోగ్యం గురించి తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లను పరిశుభ్రం చేసి ప్రజలకు మంచినీటిని అందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి, ఏఓ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మరడాంలో..

దత్తిరాజేరు: మండలంలోని మరడాం ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం మెగా పేరెంట్ - టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ - 2 సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

11న రౌండ్ టేబుల్ సమావేశం

శృంగవరపుకోట: సంక్షేమ వసతిగృహాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల పరిరక్షణ కోసం ఈ నెల 11న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు దళిత ఉద్యమనేత ఎ.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నేతృత్వంలో సమావేశం ఆరోజు ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల మేధావులు, విద్యావేత్తలు, దళిత సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బి.ఈశ్వరరావు, డోల కేశవ, జి.శ్రీనివాసరావు, కె.అప్పారావు, ఎం.వెంకటరమణ, కె.రవి, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దళిత ఉద్యమ నేతలు

కదం తొక్కిన కార్మికులు..



గజపతినగరం: మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దేశ వ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం సార్వత్రిక సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా అన్ని వర్గాల కార్మికులు భారీ ర్యాలీలు, మానవహారాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమాల్లో సీఐటీయూ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, వీఆర్‌ఏలు, వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వేపాడ: మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల ర్యాలీ



చీపురుపల్లి: మెయిన్‌రోడ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



కొత్తవలస: కొత్తవలస జంక్షన్‌లో ఉమా జూట్‌మిల్లు కార్మికుల నిరసన



శృంగవరపుకోట: సమ్మెకి మద్దతుగా నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

వినియోగదారులకు మెరుగైన సేవలు



జామిలో విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ లక్ష్మణరావు

జామి: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. విద్యుత్ పరమైన ఎటువంటి సమస్య ఉన్నా 1912 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సురేష్ బాబు, ఎ.డి వెంకటరావు, ఏఈ జ్యోతీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.